దుష్ఫలితాలు లేని వైద్యం ఆయుర్వేదం



రామంతాపూర్: లక్ష్మీనారాయణ కాలనీలో లాన్స్ రెమెడీస్ అనే ఆయుర్వేద మందుల తయారీ యూనిట్‌ను ఆదివారం ప్రభుత్వ ఆయుర్వేద మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాములపర్తి రామారావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దుష్ఫలితాలు లేకుండా అన్ని వ్యాధులను నయం చేసే శక్తి ఆయుర్వేదానికి ఉందన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు నాగరాజును అభినందించారు. కార్యక్రమంలో సర్వేశ్వరరావు, శ్రీనివాస్, రేణుక తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి పర్వదిన ఏర్పాట్లపై సమావేశం



మల్కాజిగిరి: నేరేడ్‌మెట్‌లోని అన్నపూర్ణ సహిత శ్రీకాశీ విశ్వనాథ ఆలయంలో రాబోయే శివరాత్రి పర్వదినం సందర్భంగా ఏర్పాట్లపై దేవాలయ అధ్యక్షుడు బీఎం వెంకట్రావు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ సభ్యుల నుంచి సలహాలను సూచనలు తీసుకున్నారు. గత సంవత్సరం పర్వదినం సందర్భంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని భక్తులకు ఈసారి మెరుగైన వసతులు కల్పించాలని తీర్మానించామన్నారు. సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మోదీ సంక్షేమ పథకాలు భేష్



గౌతంనగర్: బీజేపీ చేపట్టిన పల్లెకు పోదాం, బస్తీలకు పదండి కార్యక్రమంలో భాగంగా ఆదివారం గౌతంనగర్ డివిజన్ పరిధిలోని ఇందిరానెహ్రూనగర్‌లో బీజేపీ శ్రేణులు ఇంటింటికీ తిరుగుతూ ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వాసంశెట్టి శ్రీనివాస్, డివిజన్ ఇన్‌చార్జి జి.ఆనంద్, బీజేపీ గౌతంనగర్ డివిజన్ అధ్యక్షుడు ఎస్.లక్ష్మణ్‌రావు, కన్వీనర్ బంగారి రవి, స్వర్ణలత, బాలసుబ్రహ్మణ్యం, బలరాం, సాగర్ భగత్, గణేష్ యాదవ్, రాజేష్, గౌతమ్, వివేక్ తదితరులు ఉన్నారు.

ఘనంగా శంకుస్థాపన పూజా కార్యక్రమం



మల్కాజిగిరి: ఓల్డ్ మల్కాజిగిరిలోని పురాతన ఆంజనేయస్వామి దేవాలయం పునర్నిర్మాణంలో భాగంగా ఆదివారం శంకుస్థాపన పూజా కార్యక్రమం ఘనంగా జరిగింది. పూజా కార్యక్రమాలను ఆలయ ఈవో వెంకన్న, ప్రధాన అర్చకులు సాయిశర్మ పర్యవేక్షించారు. కార్యక్రమంలో పునర్నిర్మాణ దాతలు మండల రాధాకృష్ణ యాదవ్, చింతల మల్లేష్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్, రంగావిజయ్‌కుమార్, లింగమయ్య, హనుమయ్య, రామక్రిష్ణ, దుర్గారాం, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి



సమావేశంలో బీసీ కులాల ప్రతినిధులు

అల్వాల్: బీసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని బీసీ కులాల ఐక్య వేదిక మల్కాజిగిరి నియోజకవర్గ కన్వీనర్ కామల్ల ఐలన్న అన్నారు. వినాయక్‌నగర్ డివిజన్ సంతోషిమానగర్‌లోని జీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో బీసీ కులాల ఐక్య వేదిక సమావేశం ఆదివారం జరిగింది. కార్యక్రమంలో ఐలన్నతో పాటు నియోజకవర్గ కన్వీనర్లు, డివిజన్ల కన్వీనర్లు, బీసీ కుల సంఘాల నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐలన్న మాట్లాడుతూ బీసీ కులస్తులు వారి హక్కుల కోసం, సమస్యల పరిష్కారం కోసం కృషి, పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కో–కన్వీనర్‌లు రొయ్యల కృష్ణమూర్తి, రాజు, రమేష్‌గౌడ్, సీతారామశర్మ, పిట్టల భాస్కర్, కిరణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మల్లాపూర్: నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని దుర్గానగర్ కాలనీ వద్ద మూసివేసిన యూరియ ఫ్యాక్టరీ వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఆదివారం లభ్యమైంది. మృతి చెందిన వ్యక్తి వయస్సు 30 ఏళ్లు ఉండవచ్చని నాచారం పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించినట్లు ఎస్ఐ సారంగపాణి తెలిపారు.

నృత్యం.. మనోహరం..



ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రమణిసిద్ధి ఆధ్వర్యంలో నెల నెల కళారాధన కార్యక్రమంలో భాగంగా లక్ష్మీరామ శిష్య బృందంచే నిర్వహించిన కర్ణాటక గాత్ర కచేరిలో అన్నమాచార్య, రామదాసు, మీరాబాయి, పురందరదాసు, తులసి దాసు, సంకీర్తనలను అక్షర, ఆద్య, శ్రావ్య, మౌక్తిక తదితరులు వీనులవిందుగా వినిపించారు. మనోజ శిష్య బృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్యం అలరించింది. కళాకారులను రమణి సిద్ధి సత్కరించారు.

లయన్స్ క్లబ్ సేవలు భేష్

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



మందులను అందజేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్: లయన్స్ క్లబ్ సేవలు ఎనలేనివని ఎందరినో అక్కున చేర్చుకుని చేరదీసి ఆదుకుందని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కొనియాడారు. ఈ మేరకు ఆదివారం ఉప్పల్ కళ్యాణపురి కమ్యూనిటీ హాల్‌లో లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని స్థానిక కార్పొరేటర్ బన్నాల ప్రవీణ్ ముదిరాజ్‌తో, డిస్ట్రిక్ట్ గవర్నర్ కె.హరీష్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కంటి పరీక్ష, డయాబెటిక్, డెంటల్, ఆర్థో, వినికిడి సమస్య, బోన్ డెన్సిటి, ఈసీజీ వంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ వైస్ గవర్నర్ క్రిష్ణ ప్రసాద్, కె.ఇన్నారెడ్డి, డా.లక్ష్మణ్ మూర్తి, మంద సురేష్ కుమార్, సత్యనారాయణ, బీఆర్ఎస్ నేత బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, కళ్యాణపురి రెసిడెన్సీ వెల్‌ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కుషాయిగూడ: సామాజిక భావనతో ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్, వెంకటేశ్వరనగర్ షిరిడీ సాయిబాబా ఆలయ 29వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఎంఎస్‌రెడ్డి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, గుమ్మడి జంపాల్‌రెడ్డి, నవీన్‌గౌడ్, ట్రస్టు అధ్యక్షుడు బేతి పాండు, వసంతరావు, వీరభద్రరావు, శ్రీపతి, రాజారావు, నాదంచారి, మాలశ్రీ, రమాదేవి, నాగయ్య, విఠల్, సురేష్‌గౌడ్, భరత్‌సింగ్, సుబ్బలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్

కుషాయిగూడ: శారీరక దారుఢ్యం, మానసిక స్థైర్యంతో పాటు ఆత్మ రక్షణకు మార్షల్ ఆర్ట్స్ దోహదపడుతుందని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. హెచ్‌బీకాలనీ డివిజన్ కృష్ణానగర్ జూడ మార్షల్ ఆర్ట్స్ ఆర్గనైజేషన్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన విద్యార్థుల బెల్ట్‌గ్రేడింగ్ కార్యక్రమానికి హాజరై విద్యార్థులకు బెల్ట్‌గ్రేడింగ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు అన్ని రంగాల్లో నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు. విద్యార్థులకు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇస్తూ ప్రోత్సహించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, గుమ్మడి జంపాల్‌రెడ్డి, దూసరి నవీన్‌గౌడ్, కుమార్, బ్రహ్మచారి, మల్లారెడ్డి, సుఖేందర్‌రెడ్డి, అంజయ్యగౌడ్, బాలయ్యగౌడ్ పాల్గొన్నారు.

మల్లాపూర్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతా

మల్లాపూర్: ఉప్పల్ నియోజకవర్గంలో మల్లాపూర్ డివిజన్‌ను మరో రెండేళ్లలో ఆదర్శ డివిజన్‌గా తీర్చుదిద్దుతానని కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. మల్లాపూర్ డివిజన్‌కు కార్పొరేటర్‌గా వరుసగా రెండోసారి ఎన్నికై రెండో టర్మ్‌లో మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం వార్డు కార్యాలయంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎనిమిదేళ్లలో డివిజన్‌లో నెలకొన్న అనేక సమస్యలను పరిష్కరించి అభివృద్ధి చేశానని, మరో రెండేళ్లలో అభివృద్ధిలో నియోజకవర్గంలోనే ఆదర్శ డివిజన్‌గా మారుస్తానని తెలిపారు.



కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డిని సన్మానిస్తూ..

మెరుగైన వైద్య సేవలు అందాలి



వైద్య శిబిరంలో కాలనీవాసులు

బోడుప్పల్: సమాజంలో ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్య సేవలు అందాలని బోడుప్పల్ 19వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బొమ్మక్ శ్రీనివాస్ అన్నారు. 19వ డివిజన్ ఈస్ట్ బృందావన్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం విజయ డయాగ్నస్టిక్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరికీ అన్ని రకాల వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వం, పాలకులపై ఉందన్నారు. నేటికీ సమాజంలో కొందరికి సరైన వైద్యం అందడం లేదన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు బీకే నాయక్, సత్యనారాయణ, అశోక్‌రెడ్డి, రమేష్‌బాబు, హనుమంత్‌రావు, నారాయణరెడ్డి, శివ, సానియల్ శ్రావణ్‌యాదవ్, కరుణాకర్, అంజిరెడ్డి, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

శాంతి భద్రతల్లో సీసీ కెమెరాల పాత్ర కీలకం



సీసీ కెమెరాల ప్రారంభోత్సవంలో ఇన్‌స్పెక్టర్ గోవింద్‌రెడ్డి

బోడుప్పల్: సీసీ కెమెరాలు శాంతి భద్రతలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ గోవింద్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని 16వ డివిజన్ పీఎస్ఆర్ కాలనీలో కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్ తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలను అరికట్టడంలో, నేరస్తులను త్వరితగతిన గుర్తించి వారికి శిక్షపడేందుకు సీసీ కెమెరాలు ప్రధాన భూమిక పోషిస్తాయన్నారు. కాలనీవాసులు తమ ఇళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం కాలనీవాసులకు సీసీ కెమెరాల ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ శివకుమార్, 16వ డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ దిలీప్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు అశోక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి

బోడుప్పల్: దేశవ్యాప్తంగా ఈనెల 16వ తేదీన జరిగే కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నందూరి కరుణకుమారి అన్నారు. బోడుప్పల్ ఇందిరానగర్ కాలనీలో ఆదివారం ఏఐటీయూసీ మండల కార్యదర్శి దండు రమేష్ ఆధ్వర్యంలో ఆవిష్కరించిన వాల్ పోస్టర్‌ను ఆమె ప్రారంభించారు.ఆమె మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత కార్మికులు సాధించుకున్న 44 రకాల చట్టాలను 4 కోడ్‌లుగా చేసి కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్, భూతం ఐలయ్య, ఎండీ అన్వర్, మాచర్ల కనకయ్య, ఇస్తారి, సోమరాజు, రాంచందర్, వెంకటమ్మ, లక్ష్మి, మణెమ్మ, సుజాత, రమేష్, రజిత ఉన్నారు.

రాజగోపురం నిర్మాణానికి భూమిపూజ



ఆలయ రాజగోపురం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న కమిటీ సభ్యులు

అల్వాల్: పాత అల్వాల్‌లోని అతి పురాతనమైన శ్రీసీతారామచంద్ర స్వామి రాజగోపురం నిర్మాణానికి ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం భూమిపూజ నిర్వహించారు. ఈ నిర్మాణానికి దాదాపు ఆరు నెలలు పడుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సంపత్ ఆచార్యులు, రాజశేఖర్, రామాలయ కమిటీ అధ్యక్షులు పరంధామ, చంద్ర ప్రకాష్‌రావు, రంగారావు, చలపతిరావు, రఘుపతిరావు, తిరుమలరావు, రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవారి కల్యాణం



మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీ వేంకటేశ్వర దేవస్థానంలో ఆదివారం శ్రీవారి కల్యాణం ప్రధాన అర్చకులు ముడుంబై వేంకటరమణాచార్యులు ఘనంగా నిర్వహించారు. ప్రతినెలా రెండవ ఆదివారం లోక కల్యాణార్థం శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్నామని దేవస్థానం ఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు.

కవి యాత్రలో తులసి రమణాచార్యులు



మల్కాజిగిరి: కోదాడ నుంచి ఢాక్రి (నడిగూడెం) రాజావారి కోట వరకు ఆదివారం సిలివేరు కళాపీఠం, కవి యాత్రా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కవి యాత్రలో మల్కాజిగిరికి చెందిన అక్షర కౌముది సామాజిక సాహిత్య సేవా సంస్థ అధ్యక్షుడు తులసి రమణాచార్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తులసి రమణాచార్యులు తన కవితా గానంతో ఆకట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్ జానపద సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షులు పొట్లూరి హరికృష్ణ, కారం శంకర్, లింగమూర్తి, కృష్ణమూర్తి, వెంకట్ తదితరులు ఆయనను సన్మానించారు.

గృహజ్యోతి పత్రాల స్వీకరణ



ఇందిరానెహ్రూనగర్‌లో గృహజ్యోతి పత్రాలను స్వీకరిస్తున్న ఏడీఈ యాదగిరి

గౌతంనగర్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశం పెట్టిన గృహజ్యోతి కార్యక్రమాన్ని విద్యుత్ ఏడీఈ యాదగిరి ఆదివారం గౌతంనగర్ డివిజన్ పరిధిలోని ఇందిరానెహ్రూనగర్‌లో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 6 గ్యారెంటీల్లో భాగంగా స్థానిక కమ్యూనిటీ హాల్‌లో గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించామన్నారు. 200 వరకు కరెంట్ యూనిట్‌లను వాడుకున్న వారికి బిల్లులు సవరణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కన్నెమళ్ల నాగరాజు, వైనాల ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

పురగిరి క్షత్రియ పెరిక కుల సంఘం నూతన కమిటీ



రాజును అభినందిస్తున్న సంఘం ప్రతినిధులు

గౌతంనగర్: మల్కాజిగిరి నియోజకవర్గం పురగిరి క్షత్రియ పెరిక సంఘం నూతన అధ్యక్షుడిగా మల్కాజిగిరి సర్కిల్ గౌతంనగర్ డివిజన్‌కు చెందిన దిడ్డి రాజు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంజయ్‌నగర్‌లోని బొల్లంపల్లి రెసిడెన్సీలో పెరిక సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి సంఘం రాష్ట్ర అసోసియేట్ సుంకరి ఆనంద్, రాష్ట్ర కోశాధికారి, గ్రేటర్ హైదరాబాద్ సంఘం గౌరవ సలహాదారులు దొంగరి మనోహర్ హాజరయ్యారు. వారి సమక్షంలో నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షులుగా దిడ్డి రాజు, ప్రధాన కార్యదర్శిగా శ్రీరాం విజయ్ భాస్కర్, కోశాధికారిగా తోట రాజేష్ ఏకగ్రీవంగా నియమితులయ్యారు. సంఘం మాజీ అధ్యక్షులు గోర్ల రాజశేఖర్, గౌరవ సలహాదారులు మంచాల సురేష్, రంగారెడ్డి సోషల్ మీడియా ఇన్‌చార్జి మేకల మహేష్, స్థానిక సీనియర్ నాయకులు, సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మోదీ మతతత్వ విధానాలను ప్రతిఘటించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

కుషాయిగూడ: ప్రధాని మోదీ కార్పొరేట్, మతతత్వ విధానాలను ప్రతిఘటించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. ఈ నెల 16వ తేదీన నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త రైతాంగ గ్రామీణ బంద్ నేపథ్యంలో ఆదివారం చర్లపల్లి పారిశ్రామికవాడలో నిర్వహించిన కార్మిక సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. మోదీ ప్రభుత్వ వైఫల్యాలపై చార్జ్‌షీటు ప్రకటిస్తామన్నారు. దేశవ్యాప్త రైతాంగ గ్రామీణ బంద్‌లో అన్ని వర్గాల కార్మికులు, కూలీలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఎస్.శంకర్‌రావు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఎస్.శివబాబు, ప్రవీణ్, చంద్రశేఖర్, శ్రీకాంత్, సత్యనారాయణ, జి. శ్రీనివాసులు, గణేష్, నరసింహ, వెంకటేష్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ బహిరంగ సభను విజయవంతం చేద్దాం

మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: చలో నల్లగొండ భారీ బహిరంగ సభను ఈ నెల 13వ తేదీన విజయవంతం చేద్దామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడి అన్నారు. బోయిన్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆదివారం ఎమ్మెల్యే సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈ నెల 13వ తేదీన నల్లగొండలో భారీ బహిరంగ సభకు వెళ్లేందుకు ఏర్పాట్లపై చర్చించారు. మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, నాయకులు బద్దం పరుశురాంరెడ్డి, రావుల అంజయ్య, ఉపేందర్‌రెడ్డి, రాముయాదవ్, అనిల్‌కిషోర్, జీకే.హన్మంతరావు పరమేష్, లడ్డు, నరేందర్‌రెడ్డి, మధుసుదన్‌రెడ్డి, శివకుమార్, భైరు అనిల్, అతిక్ తదితరులు ఉన్నారు.

వ్యక్తి అదృశ్యం



గిరీష్ (ఫైల్)

అల్వాల్: ఫంక్షన్‌కు వెళ్లొస్తానని బయటకు వెళ్లిన వ్యక్తి తిరిగిరాని ఘటన నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మారుతినగర్‌లో నివసించే తోకల గిరీష్ మొబైల్ రిపేర్ చేస్తుంటాడు. ఈ నెల 9వ తేదీన రాత్రి ఫంక్షన్‌కు వెళ్తున్నానని భార్యకు చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో అన్ని చోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో నేరేడ్‌మెట్ పోలీసులకు భార్య మానస ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భర్తతో గొడవపడి వివాహిత..

ఉప్పల్: ఇద్దరు పిల్లల తల్లి అదృశ్యమైన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిలుకానగర్ ప్రాంతానికి చెందిన కుందన్ సింగ్ భార్య జాన్వి దేవి(32) షాపు నిర్వహిస్తోంది. శనివారం భర్తతో గొడవపడి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుందన్ సింగ్ ఉప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మతిస్థిమితం లేని...

ఉప్పల్: మతిస్థిమితం లేని మహిళ అదృశ్యమైన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిలుకానగర్ న్యూరాంనగర్ ప్రాంతానికి చెందిన గంధమల్ల రాములు భార్య ఎల్లమ్మ(58) శనివారం సాయంత్రం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుమారుడు నర్సింగ రావు ఆదివారం ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రూ.లక్ష విలువ చేసే మద్యం లభ్యం



ఘట్‌కేసర్: రాచకొండ సీపీ ఆదేశం మేరకు ఘట్‌కేసర్ పోలీసులు ఆదివారం తెలవారు జామున అర్‌ఓఆర్‌ఆర్ ఎగ్జిట్ వద్ద తనిఖీలు చేపట్టారు. ఓ కారులో మధ్యప్రదేశ్ నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యం లభించింది. బారుపాటి జగన్ మోహన్(51) రామన్నపేట్ వరంగల్, మేరెడ్డి ప్రశాంత్‌రెడ్డి(28) వనపర్తి జిల్లా వాసులుగా తేలింది. మధ్యప్రదేశలోని కోలాపూర్ నుంచి అనుమతి లేకుండా సిగ్నిచర్ బాటిల్స్ 84, రాయల్ స్టాగ్ బాటిళ్లు 12, ఆఫీసర్ ఛాయిస్ బాటిళ్లు 96తో పాటు కారును స్వాధీనం చేసుకున్నారు. మద్యం విలువ రూ.లక్షగా తేలింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అడిషనల్ డీసీపీ ప్రసాదరావు, ఉప్పల్ మహిళా పీఎస్సై మంజుల, ఘట్‌కేసర్ పోలీసులు ఉన్నారు.

కొరత.. కలత

- సర్కారు దవాఖానాల్లో డాక్టర్లు, సిబ్బంది కొరత
- నిత్యం ఇబ్బందులు పడుతున్న రోగులు



సాక్షి, మేడ్చల్ జిల్లా: నగర శివారుల్లో పెరిగిన జనాభా, కాలనీలకు అనుగుణంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవసరమైన వైద్యులు, స్టాఫ్ నర్సులు, సిబ్బంది, ఆశ వర్కర్ల పోస్టులను భర్తీ చేయకపోవడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మేడ్చల్ జిల్లాలో మల్కాజిగిరి కేంద్ర ఆస్పత్రితో సహా ఘట్‌కేసర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌తో పాటు 26 ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 12 గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, 70 పల్లె దవాఖానాలు, 112 బస్తీ దవాఖానాలు ఉన్నాయి. అలాగే, ఐదు నెలల క్రితం మేడ్చల్, శామీర్‌పేట ప్రభుత్వ ఆస్పత్రులను కమ్యూనిటీ హెల్త్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేశారు. అప్‌గ్రేడ్ చేసిన సీహెచ్‌సీల్లో కనీస వసతులతో సహా డాక్టర్లు, సిబ్బందిని నియమించకపోవడంతో రోగులు అవస్థలు పడుతున్నారు. ఇదిలా ఉండగా జిల్లాలో 72 స్టాఫ్ నర్సులతో పాటు యూపీహెచ్‌సీలు, బస్తీ, పల్లె దవాఖానాల్లోని 26 డాక్టర్లు, నలుగురు పారా మెడికల్ సిబ్బంది పోస్టులను భర్తీ చేయకుండా ఖాళీగా ఉంచడంతో రోగుల బాధల వర్ణణాతీతం.

రోగులకు తప్పని వెతలు..

మేడ్చల్, ఘట్‌కేసర్ ఆస్పత్రిలో డాక్టర్లు, సిబ్బంది కొరత రోగులపాలిట శాపంగా మారుతోంది. ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులతో సహా పల్లె, బస్తీ దవాఖానాల్లో వైద్యులు, సిబ్బంది కొరతకు తోడు.. సమయానికి రాని వైద్యాధికారులు, సిబ్బంది వైఖరితో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాల్లో 12 గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు ఉండగా, ఇందులో 11 కేంద్రాల్లోనే ప్రసవాలు చేస్తున్నా.. డాక్టర్లు అందుబాటులో లేని కారణంగా గర్భిణులు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారు. 26 పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉండగా, ఇందులో ఆరింటిలో ప్రసవాలు చేస్తున్నామని జిల్లా వైద్యారోగ్యశాఖ చెబుతున్నా.. ఆచరణలో అమలుకు నోచుకోవడం లేదు. కొత్త ప్రభుత్వం ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.